

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



హం లాయెహై తూఫాన్ సె కష్తీ నికాల్ కే
ఇస్ దేశ్ కొ రఖ్‌నా మెరె బచ్చో సంభాల్ కే.
తుం హీ భవిష్య్ మెరె భారత్ విశాల్ కే
ఇస్ దేశ్ కొ రఖ్‌నా మెరె బచ్చే సంభాల్‌కె

'జాగృతి' సినిమా అంతంలో కవి ప్రదీప్ రచించగా హేమంత కుమార్ స్వరబద్ధ పరచిన ఈ పాట ఒక తరం తన కర్తవ్యం సక్రమంగా నిర్వహించి, మరో తరానికి దేశాన్ని అప్పగించి 'మీ బాధ్యతను సక్రమంగా నిర్వహించండి' అని బోధించే సందర్భంలో వస్తుంది. ఒక అధ్యాపకుడు విద్యార్థుల నుంచి వీడ్కోలు తీసుకుంటూ వారిని ఉజ్జ్వల భవిష్యత్తు వైపు ప్రేరేపిస్తూ కర్తవ్య నిర్దేశనం చేసే అపురూపమైన దృశ్యం అది. ఇప్పుడు ఇలాంటి సినిమాలు లేవు. ఇలాంటి దృశ్యాలు లేవు. ఇలాంటి భావనలు లేవు. ఇలాంటి అత్యద్భుతమైన, ప్రేరణాత్మకమూ, ఆశావహమూ అయిన గీతాలు లేవు. అందుకే ఈ తరం ఇంకా ఆ తరం చేసిన తప్పులనే మరింత తీవ్రంగా చేస్తోంది.

కవి ప్రదీప్ ఒక ఆదర్శానికి కట్టుబడ్డ కవి. ఆయన కవితలన్నీ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రలోని గొప్పతనాన్ని చెపుతూ, భారతీయుల ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవాన్ని ఉద్దీపింపచేస్తూ, వారి ఆధ్యాత్మిక వారసత్వాన్ని గుర్తుచేస్తూ ఆత్మవిశ్వాసం అహంకారం కాకుండా అడ్డుకునే రీతిలో సృజించిన రచనలు. ఇదే సినిమాలో ప్రదీప్ రచించిన మరోపాట అయితే విద్యార్థులకు చరిత్ర నేర్పే గీతంలా నిలుస్తుంది.

ఆవో బచ్చో తుమ్హే దిఖావూ ఝూంకీ హిందుస్తాన్ కీ
జిస్ మిట్టీ సే తిలక్ కరో యే ధర్తీ హై బలిదాన్ కీ.

పిల్లలను ఎడ్యుకేషనల్ టూర్‌కి తీసుకెళ్ళిన అధ్యాపకుడు పాడేగీతం ఇది. పిల్లలకు ఆత్మత్యాగాలు, బలిదానాల భూమి చూపించి, ఆ మట్టితో తిలకం దిద్దుకోమంటున్నాడు. అత్యద్భుతమైన దేశభక్తి ప్రేరణాత్మకమైన గీతం ఇది.

తుఫానులో చిక్కిన పడవను రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చాము. ఇప్పుడీ దేశాన్ని రక్షించాల్సిన బాధ్యత మీదే. ఈ విశాల భారత దేశానికి మీరే భవిష్యత్తు. కాబట్టి ఈ దేశాన్ని ఇక మీరే రక్షించాలి. కాపాడాలి. సవ్యమైన దారిలో నడిపించాలి అంటున్నాడు కవి.

ఏ సమాజం ప్రయాణం అయినా ఒక రిలే పరుగుపందెంలాంటిది. ఒక తరం కాస్త దూరం పరుగిడుతుంది. తాను సాధించిన అభివృద్ధితోపాటు తాను చేసిన పొరపాట్ల దుష్ఫలితాలనూ తరువాత తరానికి అందిస్తుంది. అటునుంచి అందిపుచ్చుకున్నా ఆ తరువాత తరం గతంలో వారి పొరపాట్లను సవరించుకుంటూ, అభివృద్ధి ఆధారంగా పురోగమిస్తూ తరువాత తరానికి తమ మంచి చెడులను అందిస్తుంది. ఇది నిరంతరం సాగే పరుగు పందెం. ఏ సమాజమైతే గతాన్ని అవగాహన చేసుకుని, వర్తమానాన్ని అర్థం చేసుకుని భవిష్యత్తుకు బాటలు నిర్మిస్తుందో ఆ సమాజం అభివృద్ధి సాధిస్తుంది. ఇది గ్రహించని సమాజం చేసిన పొరపాట్లనే చేస్తూ దిగజారుతుంది. అంటే ఒక సమాజం

ప్రగతిలో గతం తరంతోపాటు వర్తమానం తరం బాధ్యత కూడా సమానంగానే ఉంటుంది అన్నమాట. వర్తమాన తరం గతం తరం వైపు వేలు చూపిస్తోందంటే భవిష్యత్తు తరానికి అన్యాయం చేస్తున్నట్టే.

భారతదేశ చరిత్రలాంటి చరిత్ర ప్రపంచంలో ఇతర ఏ దేశానికీ లేదు. ఇతర దేశాలకు రాజకీయ చరిత్రలుంటాయి. అక్కడక్కడా సాంస్కృతిక చరిత్రలుంటాయి. కానీ భారతదేశానికి సాంస్కృతి, రాజకీయ చరిత్రలతోపాటు అవిచ్ఛిన్న ధార్మిక చరిత్ర ఉంది. అదీ ఎలాంటి చరిత్ర!!!!! వెయ్యేళ్లు పరాయి పాలనలో ఉంటూ, నిరంతర యుద్ధాలలో మునిగి ఉండి, మనుగడ ప్రశ్నార్థకమైన తరుణంలో కూడా తమ ధర్మాన్ని సజీవంగా నిలుపుకున్న చరిత్ర. ఇలాంటి తుఫానులన్నీ దాటుకుని స్వాతంత్ర్యం సాధించి భారత జాతి ఆత్మగర్వంతో, సజీవంగా నిలబడటం ప్రపంచంలోనే ఒక అపురూపమైన విషయం. ముఖ్యంగా స్వాతంత్ర్యంతోపాటు దేశ విభజన జరగటం, మతం ఆధారంగా మనుషులు పశువుల కన్నా ఘోరంగా, రాక్షసులకన్నా వికృతంగా ప్రవర్తించటం భారతదేశం ఎదుర్కొన్న అతి ఘోరమైన తుఫాను.

**ఆయా సమయ్ బడా బేఢంగా**

**ఆజ్ ఆద్మీబనా లఫంగా**

**కహీ పె ఝగ్డా కహీ పె దంగా**

**నాచ్ రహా నర్ హోకర్ నంగా**

**ఛల్ ఔర్ కపట్ కె హాథో అప్నా**

**బేచ్ రహా ఈమాన్**

**కితనా బదల్ గయాఇన్సాన్**

**దేఖ్ తెరే సన్సార్ కి హాలత్ క్యా హోగయ్ భగ్వాన్**

'దేఖ్ తెరే సంసార్ కి హాలత్' అన్న 'నాస్తిక్' సినిమా పాటలో కవి ప్రదీప్ రాసిన ఎన్నటికీ మరవకూడని గేయం ఇది. దేశ విభజననాడు మనుషులు పశువులై నగ్నంగా నర్తించిన దుర్ఘడియను కళ్లకు కట్టిస్తుందీ గేయం. మనుషులు మోసం, కపటాలకు తమ ఆత్మను అమ్ముకుంటున్నారని విలపిస్తున్నాడు కవి.

**రాం కె భక్త్ రహీం కె బందే**

**రచ్తే ఆజ్ ఫరేబ్ కె ఫందే**

**కిత్ నే యే మక్కార్ యె అంధే**

**దేఖ్ లియే హై ఇన్‌కే భీ దంధే.**

**ఇన్‌హీ కె కాలే కర్తూతోంసె**

**హువా యె ముల్క్ మశాన్....**

'రాముడి భక్తులు, రహీము అనుచరులు కలసి మోసం ఉచ్చు బిగిస్తున్నారు. ఈ ద్రోహులు, గుడ్డివాళ్ల కార్యకలాపాలన్నీ తెలుసు. వీళ్ల దుష్కర్మల వల్లే ఈనాడు ఈ దేశం స్మశానంలా మారింది. ఎంత వేదన?

కానీ ఇంత వేదనలో కూడా కవి ఏ ఒక్కరినీ దోషిగా నిలపటంలేదు. దేశం మతం ప్రాతిపదికన విభాజితమైనా, సోదరులుగా మెలిగినవారు బద్ధశత్రువులై ఒకరి ప్రాణాలు ఒకరు తీసుకున్నా, భవిష్యత్ తరాలకు ద్వేషాన్ని పరిహరించి సామరస్య పూర్వక వాతావరణం అందించాలని ఆ తరం వారు తపన పడ్డారు. మత విద్వేషాల తుపాను గాలులనుండి సామరస్యపు జలాలవైపు దేశం పడవను మళ్లించారు.

జో హం ఆప్స్‌మే ఆపస్ మే న ఝగడ్తే
బనే హువే క్యా ఖేల్ బిగడ్‌తే
కాహే లాఖో ఘర్ యే ఉజడ్తే
క్యాయే బచ్చే మా సె బిఛడ్‌తే
ఫూట్ ఫూట్ కర్ క్యా రోతే
ప్యారే బాపూ కే ప్రాణ్....

మనలో మనం కొట్టుకోవటం వల్లే గెలుపు అంచులనుంచి ఓటమికి దిగజారామ్. లక్షల సంఖ్యలో సంసారాలు నాశనమయ్యాయి. పిల్లలు తల్లులకు దూరమయ్యారు. మన అంతర్గత కలహాలవల్లనే బాపూజీ ప్రాణాలు (ఆత్మ) ఈరోజూ దుఃఖిస్తున్నాయి

అంటే, మత మౌఢ్యం వల్ల దేశ విభజన జరిగి లక్షల సంఖ్యలో ప్రాణాలు పోయి, కోట్ల సంఖ్యలో నిర్వాసితులయి, స్వదేశంలోనే కాందిశీకులయినా ద్వేషానికి తావు ఇవ్వలేదు అన్నమాట. కవులు, కళాకారులు, మేధావులు సామరస్యం బోధించారు. మనుషుల మనసుల నడుమ నిలచిన ద్వేషము, అనుమానపు గోడలను విరగ్గొట్టి ఐకమత్యం సాధించాలని చూశారు. స్నేహ సౌభ్రాతృత్వ భావనలను ప్రచారం చేశారు.

తూ హిందూ బనేగా న ముసల్మాన్ బనేగా
ఇన్సాన్ కి ఔలాద్ హై ఇన్సాన్ బనేగా

'ధూల్ కా ఫూల్' సినిమాలో ఇలాంటి పాటకు సందర్భం కల్పించారు. నాయకుడు, నాయిక ప్రేమించుకుంటారు. నాయిక గర్భవతి అవుతుంది. నాయకుడు వేరే వివాహం చేసుకుంటాడు. నాయిక పిల్లవాడిని వదిలేస్తుంది. ఆ అనాధ పిల్లవాడిని ఒక ముస్లిం పెంచుకుంటాడు. పిల్లవాడిని పెంచుతూ పాడిన పాట ఇది. ఇలాంటి సందర్భాలలో పలురకాలుగా పాటను రాయవచ్చు. కానీ పాట రాసింది సాహిర్ లూధియాన్వీ. మతం మనిషిలో కలిగించగల మౌఢ్యాన్ని ప్రత్యక్షంగా చూశాడు. అనుభవించాడు. దేశ విభజన తరువాత పాకిస్తాన్ వెళ్లాడు. అక్కడి మౌఢ్యాన్ని, సంకుచితత్వాన్ని చూసి బెదిరిపోయాడు. అసహ్యించుకున్నాడు. భారత్ వచ్చాడు. 'బొంబాయి సినీ పరిశ్రమకు నా అవసరం ఉందని' ప్రకటించి సినీరంగంలో స్థిరపడ్డాడు. తన వ్యక్తిత్వంతో, ఆదర్శాలతో ఏమాత్రం రాజీపడకుండా గేయాలను సృజించాడు. 'ధూల్ కా ఫూల్' సినిమాలో ఎవరి పిల్లవాడో, ఏ జాతో, ఏ మతమో తెలియని పిల్లవాడిని ఎవరూ పెంచేందుకు ఇష్టపడకపోవటంతో ఓ ముస్లిం ముందుకు వస్తాడు. పిల్లవాడిని లాలిస్తు పాట అందుకుంటాడు.

అచ్ఛా హై అభీ తక్ తెర కుచ్ నాం నహీ హై
తుఝ్ కో కిసి మజ్ హబ్ సె కొయీ కాం నహీహై
జిస్ ఇల్మ్ నె ఇన్సాన్ కొ తక్సీం కియా హై
ఉస్ ఇల్మ్ క తుఝ్ పర్ కొయీ ఇల్జాం నహీ హై
తు బద్‌లె హువే వక్‌త్‌క్ అర్మాన్ బనేగా

ఇంతవరకూ నీకు ఏ పేరూ లేదు. పేరు మనిషికి గుర్తింపునిస్తుంది. ఈ గుర్తింపు అతడిని విశ్వమానవుడి స్థాయినుంచి కుచింపచేస్తుంది. ఒక మతానికో, ఒక భాషకో, ఒక జాతికో, ఒక ప్రాంతానికో పరిమితం చేస్తుంది. అతడి పరిధిని నిర్దేశిస్తుంది. ఇంకా పేరు లేదు కాబట్టి ఆ పిల్లవాడు మనిషి మాత్రమే. హిందూ, ముస్లిం, భారత్, ఇరానీ వంటి దేనితో అతడికి గుర్తింపులేదు. అందుకే తరువాత పాదంలో నీకు ఏ మతంతో, నమ్మకంతో పనిలేదు అంటున్నాడు. ఏ జ్ఞానమైతే మనిషిని విభజిస్తుందో ఇంకా దాని ప్రభావం లేదా దాని దోషం

నీకు అబ్బలేదు అంటున్నాడు. పేరు హిందువును, తెలుగువాడిని, భారతీయుడిని, ఫలానా కులం వాడిని అన్న జ్ఞానం ఇంకా ఆ పిల్లవాడికి అబ్బలేదు. అంటే ఎలాంటి సంకుచితత్వాలు, భేదభావాలు, అహంకారాలు, అపోహలు లేని స్వచ్ఛమైన స్థితిలో ఉన్నాడన్నమాట పిల్లవాడు. ఆ పిల్లవాడిని అలాంటి స్వచ్ఛమైన స్థితిలో ఉంచాలన్నది అతడిని పెంచే వ్యక్తి అభిమతం. అందుకే మారుతున్న కాలానికి గుర్తింపుగా ఎదుగుతావు నువ్వు అంటున్నాడు కవి.

మాలిక్ నే హర్ ఇన్సాన్ కొ ఇన్సాన్ బనాయా
హం నే ఉసే హిందూ యా ముసల్మాన్ బనాయా
కుద్రత్ నె తో హమె బక్షీథి ఏక్ హి ధర్తీ
హం నే కహిన్ భారత్, కహి ఇరాన్ బనాయా
జో తొడ్ దే హర్ బంద్ వొ తూఫాన్ బనేగా.

సృష్టి కర్త అందరినీ మనుషులలాగే సృష్టించాడు. మనమే హిందు, ముస్లిం అనీ, భారత్, ఇరాన్ అనీ గీతలు గీసుకున్నాము. ప్రపంచంలో సంకుచితాలకు దారితీసే రెంటినీ ప్రస్తావించాడు కవి. మతం, దేశం అంటే దారి తప్పిన ఆత్మాభిమానం, ఆత్మగౌరవం, సంకుచితత్వం అవుతుంది. మతమయినా, దేశం అయినా ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని దారి మళ్లిస్తాయి. అహంకారానికి సంకుచితత్వానికి దారి తీస్తాయి. మారణ హోమానికి కారణమౌతాయి. కాబట్టి మనిషిని సంకుచితం చేసె ఇలాంటి బంధనాలను తొలగించుకుని మనిషి మనిషిగా నిలవాలంటున్నాడు కవి సాహిర్.

నఫ్రత్ జో సిఖామే వో ధరం తేర నహీహై
ఇన్సాన్ కొ రౌందే వొ కదం తేర నహీ హై
ఖురాన్ నహో జిస్మె వొ మందిర్ నహీ హై తేరా
గీతా నహొ జిస్మే వొ హరం తేర నహీ హై
తూ అమన్ క ఔర్ సులహ్ క అర్మాన్ బనేగా...

ద్వేషాన్ని నేర్పించే ధర్మం నీదికాదు. మనిషిని అణచి వేసే పాదం నీది కాదు. మందిరం లేని ఖురాన్ నీదికాదు. ఇస్లాం మత సిద్ధాంతాలు దేన్నయితే వర్జించాయో, నిషేధించాయో వాటిని నిషేధించని గీతం నీది కాదు. ఒక మతం సమర్థించేదాన్ని సమర్థించని మతం నీది కాదు. అంటే అన్ని మతాల నడుమ సమన్వయం  సాధించిన మతం అతడిది అన్నమాట. ఒక మతం ఉదయాన్నే లేవాలని, ఇంకో మతం బారెడు ప్రొద్దెక్కేదాకా లేవద్దంటే, మాది సత్యం అంటే మాది సత్యం అని రెండు మతానుయాయుల నడుమ ఘర్షణ వస్తుంది. అందుకే, మందిరం లేని ఖురాన్, ఖురాన్ నిషేధించిన వాటిని నిషేధించని గీత నీది కాదంటున్నాడు. అంటే మతాలన్నీ ఒక్కటయి మానవత్వం ప్రవచించాలన్నమాట. అన్నీ ఒకటే చెప్పే మతం ఉంటే ప్రపంచమంతా శాంతి నెలకొంటుంది. సౌభ్రాత్వత్వ భావనలు విలసిల్లుతాయి. అందుకే 'తూ అమన్ క ఔర్ సులహ్  క  ఆర్మాన్ బనేగా' అంటున్నాడు. అంటే సుఖం, శాంతిలకు ప్రతీకగా నిలుస్తాడన్నమాట అతడు. 'అర్మాన్' అంటే కోరిక 'అమన్' అంటే శాంతి. సులహ్ అంటే కలసి సుఖంగా ఉండటం. ఈ రెండిటి కోరికగా అతడు నిలవాలన్నది, వాటికి ప్రతీకగా నిలచి వాటిని అతడు నెలకొల్పాలన్నది ఆశయం.

యే దీన్ కె తాజిర్ యె వతన్ బేచ్ నె వాలే
ఇన్సానొంకి లాషోం కె కఫన్ బేచ్  నె వాలే
యే మహెలోం మె బైఠే హువె కాతిల్ యె లూటేరే

**కాటోంకె ఎవజ్ రూహ్ – ఎ– చమన్ బేచ్‌నె వాలె**

**తూ ఇన్ కె లియే మౌత్క ఏలాన్ బనేగా**

సాహిర్ వామపక్ష భావాల ప్రభావం కలవాడు. దైవాన్ని నమ్మడు. మతం మత్తుమందు అని నమ్మేవాడు. ధనవంతులు దొంగలు, దోపిడీగాళ్లని విశ్వాసం కలవాడు. ముఖ్యంగా ధనవంతుడయిన తండ్రి బాల్యంలోనే సాహిర్‌ని చంపాలని, సాహిర్‌ని అప్పచెప్పాలని తల్లిని తన ధనబలంతో హింసించటం అనుభవించినవాడు. అందుకే అతడికి ధనవంతులంటే అసహ్యం. అతడి ఆ భావాలన్నీ, వామపక్ష భావాలతో మిళితమై చివరి చరణాన్ని శక్తివంతం చేస్తాయి. 'దీన్' అంటే మతం. 'తాజిర్' అంటే వ్యాపారం చేసేవారు. అంటే మతాన్ని తమ స్వార్థం కోసం వాడుకుని 'వ్యాపారం'గా 'స్వలాభం'గా మార్చుకున్న మత పెద్దలన్నమాట. 'వతన్ బేచ్ నె వాలే' అంటే దేశాన్ని అమ్మేసే వాళ్లు. మతాన్ని వ్యాపారంగా మలచుకున్న వాళ్లు, దేశాన్ని అమ్మేసేవాళ్లు, మనుషుల శవాలపై కప్పిన గుడ్డను సైతం అమ్ముకుని సొమ్ముచేసుకునే వాళ్లు. వీళ్లంతా ఎవరూ అంటే అక్రమంగా డబ్బులు సంపాదించి మేడలు మిద్దెలు కట్టుకుని కులికే దోపిడీగాళ్లు. హంతకులు... వీళ్ళు ఈ పూలతోటలో ముళ్ళలాంటి వారు, పూలతోటలాంటి దేశాన్ని ముళ్ళతో నింపి అమ్ముకునేవాళ్ళు వీళ్లతో దేశం నిండి ఉంది. ఈ పదాలు వింటూంటే సాహిర్ ఆ కాలం గురించి రాస్తున్నాడా, ఈ కాలం గురించి రాస్తున్నాడా అన్న అనుమానం వస్తుంది.

ముఖ్యంగా కొరోనా నేపథ్యంలో వైరస్ వ్యాప్తికి మతం రంగు పులిమి రాజకీయాలు చేయటం, మతం ఆధారంగా ప్రజల నడుమ అడ్డుగోడలు నిలిపి, ద్వేషభావాలు రెచ్చగొట్టం, అలాగే వలస కూలీల ఆధారంగా జరిగే రాజకీయాలు, వారికి సేవ చేస్తున్నట్టు చూపించి రాబట్టే డొనేషన్లు, నింపుకునే బొక్కసాలు, చేస్తున్న రాజకీయాలు, మనుషుల ప్రాణాలతో చెలగాటాలాడుతూ లాభాలు పొందాలనుకునే వాళ్ళు వంటివి చూస్తూంటే 'యే దీన్ కె తాజిర్ యె వతన్ బేచ్ నె వాలే

ఇన్సానొంకి లాషోం కె కఫన్ బేచ్ నె వాలే

అప్పటికన్నా ఇప్పుడే ఎక్కువగా ఉన్నారనిపిస్తుంది. అందుకే చివరలో 'వీరందరినీ అంతం చేయాలి నువ్వు'అన్న భావన సాహిర్ ప్రదర్శిస్తే బాధ అనిపిస్తుంది.

ఆ కాలం వారు ఎలాంటి ఆదర్శంతో, ఎలాంటి ఆశాభావంతో భవిష్యత్తు గురించి ఊహించారో అర్థమయి బాధ కలుగుతుంది.

**దునియా కె దావ్ పేచ్ సె రఖ్‌నా నవాస్తా**

**మంజిల్ తుమ్హారీ దూర్ హై లంబా హై రాస్తా**

**భట్ కా నాదే కోయీ తుమ్హే ధోకే మే డాల్ కే.**

ప్రపంచంలోని అనవసర వాదాలు, వివాదాల జోలికి పోకు. నీ గమ్యం ఉత్తమం. దారి కఠినం. బహుదూరం వెళ్లాల్సి ఉంటుంది. కాబట్టి ఎలాంటి దృష్టిని మళ్లించే అంశాలను పట్టించుకోకు. నిన్ను మోసం చేసి గమ్యం దారి మళ్లించేవి చాలా ఉంటాయి. మేము ఎంతో కష్టపడి తుపాను నుంచి రక్షించి పడవను ఒడ్డుకు చేర్చాము. దీన్ని రక్షించే బాధ్యత నీదేనని అధ్యాపకుడు అంటాడు.

**ఆరాం కి తుం భూల్ భులయ్యామె నభూలో**

**సప్నోంకి హిండోలోమే మగన్ హోకె న ఝూలో**

**అబ్ వక్త్ ఆగయా హై మెరే హస్తే హువే ఫూలో**

**ఉఠో చాలాంగ్ మార్‌కె ఆవాశ్ కొ ఛూలో**

**తుం గాడ్ దొ గగన్ పె తిరంగా ఉఛాల్ కే**

...

విశ్రాంతి ప్రలోభంలో పడకూడదు. కలల కౌగిలిలో మునిగి తేలకూడదు. ఇదే సమయం ఎగిరి ఆకాశాన్ని అందుకునేందుకు. ఆకాశంలో తిరంగాను ప్రతిష్ఠించాల్సిన సమయం. భారతదేశం ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో ప్రపంచంలో అత్యున్నత దేశంగా, ఆదర్శంగా ఎదగాలని మన పూర్వీకులు ఆశించారు. మనముందు తరంవారు కలలు కన్నారు. ఎన్నో త్యాగాలు చేశారు. ఎన్నో బలిదానాలు అర్పించారు. ప్రాణాలు పణంగా పెట్టి సర్వం త్యాగం చేసి దేశాన్ని రక్షించి తరువాత తరం చేతుల్లో పెట్టారు. ఆ తరువాత తరం వారు విశ్వమానవులుగా ఎదుగుతారని, స్నేహసౌభ్రాతృత్వ భావనలతో ప్రపంచానికి శాంతి ప్రదాతలుగా, అభివృద్ధి కారకులుగా నిలుస్తారని ఆశించారు. కానీ ఇలా మనం విచ్ఛిన్నకరమైన సంకుచితమైన ఆలోచనలు చేస్తూ, ఒకరికొకరు ద్వేషించుకుంటూ, వ్యర్థమైన అవసరమైన వ్యవహారాలలో శక్తిని వృధా చేస్తూ రోజురోజుకీ ప్రపంచ వీధుల్లో హాస్యం పాలవుతున్నాము. బికారీల్లా నిలుస్తున్నాము. మన పూర్వీకుల ఆశలను అడియాసలుగా మిగులుస్తూ గతం నుంచి ఏమీ నేర్చుకోనివాడు అవే తప్పులను చేస్తాడని నిరూపిస్తూ అంధయుగంలోని అంధకారంలోకి పరుగులిడుతున్నాము.

'హోగే యహీ ఝుమేలే' అని షకీల్ అన్నట్టు, అవే గొడవలు, అవే తలనొప్పులు, అవే సంకుచితాలు, అవే ద్వేషాలతో కొట్టుమిట్టాడుతున్నాము.

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments